# విలువ

కథ

**వేంపల్లి రెడ్డి నాగరాజు**




**''అన్నా, ఈ రోజు పేపర్ చూసినావా?'' అప్పుడే నిద్రలేచి పడక గదిలో నుండి నేరుగా వరండాలోకి వచ్చిన ఎమ్మెల్యే భుజంగాన్ని ప్రశ్నించాడు. ఇటీవలే పార్టీలో చేరి ఎమ్మెల్యే ముఖ్య అనుచురుడిగా గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న యువ నాయకుడు గోపాలం.**

''భూ ఆక్రమణలు, కాంట్రాక్టర్ల అవినీతి, నాయకుల స్వప్రయోజనాలు, అధికారుల లంచగొండి తనం, రోడ్డు ప్రమాదాలు, కట్నం చావులు, అన్నీ ఇలాంటి వార్తలే కదా, ఈ 'రొటీన్ న్యూస్' చదవడానికి కూడా అంత తొందరెందుకు?'' ప్రశ్నించాడు భుజంగం.

''అదికాదన్నా, ఈ రోజు ఓ 'ఇంపార్టెంట్' న్యూస్ వుంది. అందుకే పరుగెత్తుకుంటూ వచ్చా'' ఉదయాన్నే తన రాకకు గల కారణాన్ని చెప్పాడు గోపాలం.

''సస్పెన్స్ ఎందుకుగానీ, అంత ఇంపార్టెంట్ న్యూస్ ఏమిటో చెప్పరాదా?'' ఆసక్తిగా చూస్తూ అడిగాడు ఎమ్మెల్యే.

''మన జిల్లాకు చెందిన నలుగురు రైతులు రాత్రి మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకున్నారట, ఈ విషయం అన్ని పేపర్లలోనూ మొదటి పేజీల్లో వేశారు'' ఎవరో తరుముకొస్తున్నట్లుగా చెప్పాడు గోపాలం.

''జిల్లాలో ఏ మూలనో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే నువ్వెందుకయ్యా అంతగా ఆందోళన చెందుతున్నావు?'' సిగరెట్ వెలిగించుకుంటూ ప్రశ్నించాడు ఎమ్మెల్యే.

''ఆ ప్రాంతం సాక్షాత్తూ మంత్రి గారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమన్నా'' అసలు విషయం అదేనన్నట్లుగా బదులిచ్చాడు గోపాలం.

''అయితే మనకేం?'' అడిగాడు ఎమ్మెల్యే భుజంగం.

''మరో ఆరు నెలల్లో ఎన్నికలు వచ్చేటట్లున్నాయి. కనీసం ఇప్పటి నుండినైనా మనం మళ్ళీ ప్రజలకు కనిపించాలి కదా?'' ఐడియా చెబుతున్నవాడిలా అన్నాడు గోపాలం.

''అందుకని ఆ రైతుల శవాల వద్దకెళ్ళి ఏడుస్తూ కూర్చోమంటావా?'' ఎమ్మెల్యే మాటల్లో కాస్తంత విసుగు ధ్వనించింది.

''అదికాదన్నా నేను చెప్పేది, పేపరోళ్ళను పిలిచి ఆ ఘటనకు అధికారపార్టీయే బాధ్యత వహించాలని ప్రతిపక్ష నేతగా మీరు డిమాండ్ చేస్తే బాగుంటుందేమోనని'' తన ఉద్దేశ్యాన్ని వ్యక్తం చేశాడు గోపాలం.

''దాని వల్ల మనకేం లాభం?'' పూర్తిగా కాలిపోయిన సిగరెట్ పీకను మూలకు విసిరి కొడుతూ అడిగాడు ఎమ్మెల్యే భుజంగం.

''రెండు ప్రయోజనాలున్నాయన్నా, అధికార పార్టీ నాయకుల్ని ఇరుకున పెట్టినట్టుగాను వుంటుంది. రైతుల కోసం మనం పోరాటం చేస్తు

న్నట్లు ప్రజల్లో మనకు మంచి పబ్లిసిటీ కూడా వస్తుంది'' చెప్పాడు గోపాలం ఉత్సాహంగా.

''సరే అయితే, నువ్వు చెప్పినట్లుగానే చేస్తాగానీ, ఆ పనులేవో నువ్వే కాస్త దగ్గరుండి చూడు'' చెబుతూనే ఇంట్లోకి వెళ్ళిపోయాడు భుజంగం.

తను చెప్పిన వెంటనే ఎమ్మెల్యే ఆ విషయానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వడంతో ఏర్పాట్ల నిమిత్తం గోపాలం కూడా ఉత్సాహంగా బయలుదేరి వెళ్ళిపోయాడు.

మరో రెండు గంటల తరువాత, ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో...

''సార్ జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు, దీనిపై మీ అభిప్రాయం?'' ఓ విలేకరి ప్రశ్నించాడు.

''మృతి చెందిన రైతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా'' చెప్పాడు ఎమ్మెల్యే భుజంగం.

''ప్రతిపక్ష నేతగా ఈ ఘటనపై మీరెలా స్పందిస్తున్నారు?'' ప్రశ్నను సంధించాడు మరో విలేకరి.

''మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకుంటాం'' బదులిచ్చాడు భుజంగం.

''పంటలు సక్రమంగా పండక అప్పుల ఊబిలో కూరుకునిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతల సంగతేమిటి?'' అడిగాడు మరో విలేకరి.

''రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారాన్ని ఏర్పాటు చేయబోయేది మా పార్టీనే, అప్పటివరకూ రైతులు ఏ మాత్రం అధైర్యపడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా'' చెప్పాడు ఎమ్మెల్యే భుజంగం విలేకరుల సమావేశం ముగిసినట్లుగా లేస్తూ.

''ఈ వ్యవహారంలో అధికార పార్టీ గురించి మీరేమీ మాట్లాడరా?'' ప్రశ్నించాడు మరో విలేకరి.

ఎమ్మెల్యే బిగ్గరగా నవ్వాడే తప్ప ఆ ప్రశ్నకు ఏ రకమైన సమాధానం లభించలేదు విలేకరులకు.

విలేకరులంతా వెళ్ళిపోయాక...

''వాళ్ళు అడిగిన ప్రశ్నలకు మీరు చెప్పిన జవాబులు నాకే మాత్రం నచ్చలేదన్నా'' మాటల్లో తీవ్ర నిరాశ ధ్వనిస్తుండగా అన్నాడు గోపాలం.

''అంతగా మథనపడి పోతున్నావెందుకు గోపాలం?'' అడిగారు ఎమ్మెల్యే భుజంగం సిగరెట్ పొగ గుండెల నిండుగా పీల్చుకుంటూ.

''ఈ అవకాశాన్ని మనకు చక్కని అనుకూలంగా మలుచుకొని ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా అధికార పార్టీని, సంబంధిత మంత్రిని మీ మాటలతోనే చీల్చి చెండాడుతారనుకున్నా'' చెప్పాడు గోపాలం ఆవేశంగా.

''వాళ్ళు అడిగిన ప్రశ్నలకు నా సమాధానాలు బాగాలేవా?'' అడిగాడు ఎమ్మెల్యే.

''మీ సమాధానలు నాకెంత మాత్రం నచ్చలేదు'' గోపాలం అసంతృప్తిగా బదులిచ్చాడు.

''మరెలా మాట్లాడి వుండాల్సింది?'' సందేహంగా చూస్తూ ప్రశ్నించాడు ఎమ్మెల్యే.

''ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు నాలుగు లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాల్సిందిగా డిమాండ్ చేసి వుండాల్సింది'' చెప్పాడు గోపాలం.

''దాని వలన మనకేమిటి లాభం?'' మళ్ళీ అడిగాడు ఎమ్మెల్యే.

''ప్రభుత్వం ఎలాగు ఎంతో కొంత ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తుంది కాబట్టి అదేదో మన డిమాండ్ ద్వారానే సాధ్యపడినట్లుగా రైతులను నమ్మించి వాళ్ల ఓట్లన్నీ మనకే అనుకూలం చేసుకునే వాళ్ళం కదా?'' చేతికి రాబోయిన ఓట్ల బ్యాంకు దూరమైనట్లుగా భావిస్తూ అన్నాడు గోపాలం.

''చేతులు దులుపుకున్నట్లుగా కాక ఎక్స్‌గ్రేషియా మనం అడిగినంత మొత్తంలోనూ ప్రకటిస్తే అధికార పార్టీ నేతలే రైతుల దృష్టిలో దేవుళ్ళుగా చెలామణి కారంటావా?'' తను పరిహారం గురించిన డిమాండ్ ఎందుకు చేయలేదో వివరించాడు భుజంగం.

''ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ ఆ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి వర్గంలో కొనసాగుతున్న నాయకుడు తన పదవికి రాజీనామా చేయాల్సిందిగానైనా డిమాండ్ చేసి ఉంటే బాగుండేదేమో'' ఎమ్మెల్యే వివరణతో ఏ మాత్రం సంతృప్తి చెందనట్లుగా అన్నాడు గోపాలం.

''మనం అలాంటి ప్రకటనలు చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ గోపాలం'' చెప్పాడు భుజంగం.

''ఈ రకమైన అవకాశం వచ్చినప్పుడు అధికార పార్టీని ఎండగడుతూ విమర్శించక పోవడం ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతగా మీ కనీస ధర్మాన్ని విస్మరించినట్లు కాదా?'' ప్రశ్నించాడు గోపాలం ఎమ్మెల్యే తీరు ఎంత మాత్రం నచ్చనట్లుగా.

''నీలా ఆవేశపడడం కాదయ్యా, ఆలోచనతో వ్యవహరించడమే రాజకీయమంటే'' చెప్పాడు ఎమ్మెల్యే భుజంగం.

అర్థం కానట్లుగా చూశాడు గోపాలం.

''ఓరి పిచ్చోడా నువ్వు చెప్పినట్లుగా ప్రకటించి మంత్రి గారిని, వాళ్ళ పార్టీని ఇరుకున పెడితే రానున్న ఎన్నికల్లో మన పార్టీ తరపున మళ్ళీ నాకే టిక్కెట్ దక్కకుంటే ఆ పార్టీలోకి 'జంప్' చేసేందుకు కూడా అవకాశం ఉండాలి కదా?'' చెప్పాడు భుజంగం తన ముందస్తు 'వ్యూహాన్ని' అర్థం చేసుకోమన్నట్లుగా చూస్తూ.

''ఇలా పార్టీలు మారుస్తూపోతే ప్రజల్లో మనకు విలువ తగ్గిపోదా?'' అమాయకంగా ప్రశ్నించాడు గోపాలం.


గట్టిగా నవ్వేశాడు భుజంగం.

''మరి సభల్లోనూ, సమావేశాల్లోనూ మాట్లాడే సిద్ధాంతాలు, వాదోపవాదాలు?'' గోపాలం మళ్ళీ ఏదో అడగబోయాడు.

''నోటుతో'' ఓటు 'విలువ'ను కొనగలిగినంత కాలం, ఈ ప్రజాస్వామ్యంలో 'నోట్లు-ఓట్లు' సిద్ధాంతం చెల్లుబడి అయ్యేంత వరకూ మనకు 'విలువ' తగ్గినా, పెరిగినా ఏదైనా ఒక్కటే గానీ, రాత్రికి హైదరాబాద్‌కు బయలుదేరి వెళుతున్నా, నువ్వూ నా వెంట రారాదూ?'' అడిగాడు భుజంగం.

''ఇప్పట్లో అసెంబ్లీ సమావేశాలుగానీ, పార్టీ మీటింగులు గానీ లేవు కదన్నా?'' అడిగాడు గోపాలం ఎందుకీ హడావుడి ప్రయాణం అన్నట్లుగా.

''ఇందాక నువ్వు ఇరుకున పెట్టమని చెప్పిన మంత్రిగారు తన కూతురిని నా కొడుక్కి ఇస్తానని నిన్న రాత్రే 'ప్రపోజల్' చెప్పి పంపాడయ్యా, ఆ విషయం గురించే మాట్లాడేందుకు వెళ్ళాలి' చెప్పాడు ఎమ్మెల్యే భుజంగం రాజకీయాల్లో శాశ్వతమిత్రులుగానీ, శాశ్వత శత్రువులుగానీ ఉండరన్నట్లుగా చూస్తూ.



*


**రచయిత చిరునామా:**
**వేంపల్లి రెడ్డి నాగరాజు**
**ఎల్ఐసి ఆఫ్ ఇండియా**
**రాయచోటి - 516 269, కడప జిల్లా**